క్లుప్తంగా

నేడు కౌన్సిల్ సాధారణ సమావేశం

పెడన: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం మంగళవారం ఉదయం 11 గంటలకు జరుగుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ బళ్ల జోత్స్నరాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు, ఆయా విభాగాల ముఖ్యులు హాజరుకావాలని పేర్కొన్నారు.

ఫెన్సింగ్‌లో గూడూరు విద్యార్థికి పతకం



గూడూరు: స్కూలు గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి అండర్–17 ఫెన్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో గూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి నిమ్మగడ్డ హర్షిత్‌కుమార్ కాంస్య పతకం సాధించాడు. ఈ నెల 27 నుంచి 29 వరకు కర్నూలులో జరిగిన రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో హర్షిత్ కృష్ణాజిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించాడు. ప్రతిభ చూపిన హర్షిత్ కాంస్య పతకం సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయిని డి.పుష్పలత తెలిపారు.

వీఆర్వో మోహనరావు మృతి



నాగాయితిప్ప(మోపిదేవి): గుండెపోటుతో కె.కొత్తపాలెం వీఆర్వో మేరుగు మోహనరావు (58) ఆదివారం రాత్రి మృతి చెందారు. మృతుడికి భార్య నాగమణి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, స్థానిక తహసీల్దార్ కె.నవీన్‌కుమార్ సోమవారం మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నాగాయలంక తహసీల్దార్ విమలకుమారి, లింగం జగదీష్‌కుమార్, సర్పంచ్‌లు, పీఏసీఎస్ చైర్‌పర్సన్‌లు వైఎస్సార్ సీపీ నాయకులు, తదితరులు నివాళులర్పించారు.

గ్రంథాలయానికి కంప్యూటర్ అందజేత

మచిలీపట్నంటౌన్: తెలంగాణ చీఫ్ సెక్రటరీ అల్లంశెట్టి శాంతికుమారి మామయ్య, అత్తయ్య తోట జగన్నాథరావు, స్వరాజ్యలక్ష్మి జ్ఞాపకార్థం స్థానిక ఈడేపల్లిశాఖ గ్రంథాలయానికి ఆమె సోమవారం రూ. 40 వేల విలువైన కంప్యూటర్‌ను అందజేశారు. దీన్ని తెలంగాణ సీఎస్ కార్యాలయ అధికారి ప్రసాద్ అందజేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయ పాలకురాలు కోన వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ ఐదేళ్ల క్రితం శాంతికుమారి ఆమె తల్లిదండ్రులు అల్లంశెట్టి రాధాకృష్ణమూర్తి, లక్ష్మీకాంతం జ్ఞాపకార్థం రెండు కంప్యూటర్లను, 1500 పుస్తకాలను గ్రంథాలయానికి అందజేశారన్నారు. ఆరునెలల క్రితం ఆమె గ్రంథాలయానికి విచ్చేశారని ఈ సందర్భంగా మరో కంప్యూటర్ కావాలని తాను అడగ్గా సోమవారం కంప్యూటర్‌ను పంపారని చెప్పారు.

చిన్నారులు తగిన బరువు ఉండాలి



కృత్తివెన్ను: చిన్నారులు ఎత్తుకు తగిన బరువు ఉండాల్సిందేనని ప్రభుత్వ ఆదేశాల మేరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రోత్ మానటరింగ్ పేరుతో స్పెషల్ డ్రైవ్ చేపట్టినట్లు బంటుమిల్లి ఏసీడీపీవో ఆనంద్ తెలిపారు. కృత్తివెన్ను మండలంలో డ్రైవ్ నిర్వహిస్తున్నామని దీనిలో భాగంగా సోమవారం కొన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఎత్తు, బరువును నమోదు చేశారు. మార్చి 31 వరకు స్పెషల్ డ్రైవ్ ప్రోగ్రాం అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో జరుగుతుందని ఏసీడీపీఓ తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శ్యామలగౌరి, ఎంవీ రాఘవమ్మ, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి సత్యదేవుని బ్రహ్మోత్సవాలు

గుడ్లవల్లేరు: సంతరోడ్డులోని శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామివారి 70వ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం నుంచి ఫిబ్రవరి 5వ తేదీ వరకు వార్షికోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ గుడివాడ సత్యనారాయణ గుప్తా తెలిపారు. 31న స్వామివారిని పెండ్లి కుమారుని చేయటంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు, ఒకటిన సత్యదేవుని సామూహిక వ్రతాలు, 2న స్వామివారి రాయబార మహోత్సవం, 3న 108కలశాలతో స్వామివారికి అభిషేకం, 4న స్వామివారికి గరుడోత్సవం, 5న వసంతోత్సవం, మహా పూర్ణాహుతి, చక్రస్నానం, స్వామివారి పవళింపు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ప్రతి రోజు సాంస్కృతిక కార్యక్రమాలను జరుగుతాయని చెప్పారు. భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లను ఏర్పాటు చేశామన్నారు. క్యూలైన్లతో పాటు ప్రత్యేక ఏర్పాట్లు చేశామని చైర్మన్ తెలిపారు.

అర్హులకు సంక్షేమ ఫలాలు

'గడప గడప'లో మంత్రి జోగి రమేష్

గూడూరు: అర్హులకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. ఎన్నికల వరకే పార్టీలని, తర్వాత అందరూ మనవారేనని అనే నినాదం సీఎం జగన్ మోహన్‌రెడ్డిదని చెప్పారు. గూడూరు మండలం రాయవరం గ్రామంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలను అందజేస్తూ వారు పొందిన లబ్ధిని తెలుపుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలను వివరిస్తూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని ఆకాంక్షించారు. మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించాలనే సంకల్పంతో మన జగనన్న అడుగులు వేస్తున్నారని వివరించారు. వైఎస్సార్ సీపీ పాలనలో ఐదు రకాల సాధికారితలే లక్ష్యంగా పరిపాలన సాగిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మధుసూదనరావు, జెడ్పీటీసీ సురేష్‌రంగబాబు, వైస్ ఎంపీపీ కుటుంబరావు, గంగాధరరావు, సర్పంచి మల్లీశ్వరి, బాలకృష్ణ, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి సంక్షేమం

అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

టేకుపల్లి(మోపిదేవి): ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. మండలంలోని మెరకనపల్లి శివారు టేకుపల్లి, చిరువోలు గ్రామాల్లో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు.





రాయవరంలో గడప గడపలో వృద్ధురాలితో పింఛన్‌పై మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్ : చిరువోలు గొల్లపాలెంలో ఎమ్మెల్యే రమేష్‌బాబు

ఎమ్మెల్యే రమేష్‌బాబు 230 ఇళ్లకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు వివరిస్తూ వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మరోసారి జగనన్న రావాలని రైతు భరోసా అందుకోవాలని, అమ్మ ఒడి, కాపునేస్తం రావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. తొలుత టేకుపల్లిలో శ్రీ బాలా పార్వతీ సమేత రామేశ్వరస్వామిని దర్శించుకున్నారు. సర్పంచ్‌లు యర్రంశెట్టి ధనరాజ్యలక్ష్మి, గరికిపాటి వెంకటేశ్వరావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ ముత్యాల వరలక్ష్మి, గ్రామ పార్టీ కన్వీనర్ యర్రంశెట్టి రాంబాబు, బండారు సూరిబాబు, ఎంపీటీసీ సభ్యులు సనకా వెంకట రాజేష్‌బాబు, గండు దుర్గారావు, గరికిపాటి గోవిందరాజులు, మోర్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సమస్యను అడిగి తెలుసుకుంటున్న పేర్ని కిట్టు

పేదల కుటుంబాల్లో వెలుగులు

మచిలీపట్నంటౌన్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి.. పేదల కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నారని వైఎస్సార్ సీపీ నాయకుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నగరంలోని 10వ డివిజన్‌లో జరిగింది. కార్పొరేటర్ షేక్ ముంతాజ్‌బేగం, డివిజన్ ఇన్‌చార్జ్ షేక్ బాషాలతో కలిసి గడప గడపకూ వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు అందిన నవరత్న పథకాల వివరాలతో ముద్రించిన బుక్‌లెట్లను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పురంశెట్టి శ్రీనివాసరావు, సుంకర రాఘవరావు తదితరులు ఉన్నారు.

మహిళలు చట్టాలను వినియోగించుకోవాలి



సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి రామకృష్ణయ్య

చిలకలపూడి(మచిలీపట్నం): మహిళలు వారికున్న చట్టాలను వినియోగించుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య అన్నారు. స్థానిక గ్రేస్ స్కూల్ నర్సింగ్ కళాశాలలో సోమవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ సమాజంలో ఆడపిల్లల సంఖ్య తగ్గిపోతోందన్నారు. దీనికి కారణం భ్రూణ హత్యలేనన్నారు. ఆడశిశువు జన్మిస్తుందని తెలిస్తే చాలా మంది బాధ పడుతున్నారని ఇది సరికాదని హితవు పలికారు. ఏ శిశువు జన్మిస్తుందో చెప్పకుండా చట్టాలు ఉన్నాయని తెలిపారు. దీనికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలెక్టర్ నేతృత్వంలో కమిటీలను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు లేబొరేటరీలను పర్యవేక్షిస్తున్నారన్నారు. సదస్సులో న్యాయవాది చీలి ముసలయ్య, కళాశాల కరస్పాండెంట్ ఎస్.సరస్వతి, ప్రిన్సిపాల్ కేవీఎస్ శివకుమార్ పాల్గొన్నారు.

జంతువులకూ కొన్ని హక్కులు



ప్రసంగిస్తున్న జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ చంద్రశేఖరరావు

చల్లపల్లి: జంతువులకూ కొన్ని హక్కులు ఉన్నాయని, వాటిని విద్యార్థి దశలోనే తెలుసుకోవాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె.చంద్రశేఖరరావు అన్నారు. జంతు సంక్షేమ పక్షోత్సవాలను సోమవారం పురిటిగడ్డ జెడ్పీ హైస్కూల్లో చంద్రశేఖరరావు ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు జూ కు వెళ్లినపుడు అక్కడి జంతువులను కవ్వించటం నేరమని తెలిపారు. వేసవిలో పక్షుల కోసం ఇంటి బయట, ప్రహరీలపై, శ్లాబుపై వాటి కోసం చిన్న పాత్రల్లో నీరు, ఆహారం ఉంచి మానవత్వం చాటాలని కోరారు. జంతు హింసకు పాల్పడితే తీసుకోబోయే చర్యలు వివరించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. చల్లపల్లి సబ్ డివిజన్ పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ నల్లూరి వెంకట భార్గవ, మండల పశువైద్యాధికారి డాక్టర్ మనోజ్ పర్యవేక్షించారు. హెచ్‌ఎం ఏ.సుజాత, సిబ్బంది పాల్గొన్నారు.

గాంధీ సిద్ధాంతం స్ఫూర్తిదాయకం

మచిలీపట్నంటౌన్: జాతిపిత మహాత్మాగాంధీ ఆదర్శనీయుడని పలువురు వక్తలు పేర్కొన్నారు. మహాత్మాగాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని నగరంలోని పలు సంస్థలు సోమవారం నిర్వహించాయి. అజ్మీర్ బాబా దర్గా సేవా సమాజం, వైజ్‌మెన్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక వల్రగూడెంలో వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైజ్‌మెన్ క్లబ్ ఆధ్వర్యంలో సయ్యద్ పీర్, నాగేశ్వరరావు, సయ్యద్‌బాజీ, రవి, షేర్‌అలీ, ఇస్మాయిల్, రాజ్‌కమల్, సుబ్బారావు, నితిన్, కాశీం తదితరులు పాల్గొన్నారు. స్థానిక ఈడేపల్లి శాఖ గ్రంథాలయంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ పాఠకులు, గ్రంథ పాలకురాలు కోన వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

నాగాయలంక: మండల ఆర్యవైశ్య సంఘం, జై వాసవీ యూత్ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ 75వ వర్ధంతి సోమవారం నిర్వహించారు. స్థానిక వాసవీ షాపింగ్ కాంప్లెక్స్ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో తొలుత మహాత్మాగాంధీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలకు వంకాయల ఆదిరాజేష్, హరీష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేద యువకుడు బాదం జగదీష్‌కు దుస్తులు బహూకరించారు. కన్యకా పరమేశ్వరి ఆలయ కమిటీ చైర్మన్ చిట్టా సాంబశివరావు, మండల ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు చిట్టా శివనాగేశ్వరరావు, తాడికొండ సత్యనారాయణ, చిట్టా అన్నపూర్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

● సాయిబాబా గుడి సెంటర్‌లో మండల వైఎస్సార్ సీపీ ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో ఆపార్టీ వాణిజ్య విభాగం నాయకులు ఆకుతోట సుధీర్, చిట్టా బాలపాపారావు, బాలమురళి.. గాంధీ విగ్రహం, వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. జెడ్పీటీసీ సభ్యుడు మోకా బుచ్చిబాబు, ఎంపీటీసీ సభ్యుడు మోకా నాగప్రసాద్, పార్టీ కన్వీనర్ భోగాది శేషగిరిరావు, స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్ మద్ది చిన్నారి తదితరులు పాల్గొన్నారు.



గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైజ్‌మెన్ క్లబ్ ప్రతినిధులు



కోడూరులో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య ప్రముఖులు



అవనిగడ్డలో వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



నివాళులర్పిస్తున్న ఎంపీపీ కోట విజయ రాధిక

కోడూరు: గాంధీ వర్ధంతిని కోడూరులో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యాన సోమవారం నిర్వహించారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి పార్టీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, సర్పంచి వెన్నా షైనీ, పార్టీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, వైస్ సర్పంచి ఇంకొల్లు మురళీకృష్ణ, ఎస్సీసెల్ కన్వీనర్ వెన్నా ప్రసాద్ నివాళులర్పించారు. మండల ఆర్యవైశ్య సంఘం, వాసవీ కపుల్స్ క్లబ్ ఆధ్వర్యాన స్థానిక సంతమార్కెట్ రోడ్డులోని గాంధీ విగ్రహానికి ఆర్యవైశ్య ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తూనుగుంట్ల శ్రీధర్, బూరగడ్డ మురళి, కోడూరు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చల్లపల్లి: ప్రపంచానికి సత్యాగ్రహం అనే అహింసా ఆయుధాన్ని అందించిన మహాత్మాగాంధీ ఔన్నత్యం నేటితరంలో ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని ఎంపీపీ కోట విజయరాధిక అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గాంధీ వర్ధంతి సందర్భంగా మహాత్ముని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చల్లపల్లి నారాయణరావు నగర్‌లో గాంధీ విగ్రహానికి సీఐ బీ.భీమేశ్వర రవికుమార్, తమ్మన ప్రసాద్, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యులు షేక్ నబీషాహీ నివాళులర్పించారు. చల్లపల్లి పంచాయతీలో సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, వక్కలగడ్డ పంచాయతీలో సర్పంచ్ వల్లూరు ఉమా, పాగోలు పంచాయతీలో సర్పంచ్ తోట శ్రీనివాసు గాంధీ చిత్రపటాలకు నివాళులర్పించారు.

అవనిగడ్డ: సమస్త మానవాళికి గాంధీజీ సిద్ధాంతం మార్గదర్శకమని గాంధీ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ తోటకూర ప్రసాద్ అన్నారు. స్థానిక గాంధీక్షేత్రంలో మహాత్మాగాంధీ 75వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. గాంధీజీ విగ్రహానికి తోటకూర ప్రసాద్, మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగసూరి వేణుగోపాల్ రచించిన గాంధీయే మార్గం గ్రంథాన్ని తోటకూర ప్రసాద్ ఆవిష్కరించారు. వ్యాసరచన పోటీల్లో విజేతలకు తోటకూర బహుమతులను అందించారు. కార్యక్రమంలో గాంధీ క్షేత్రం కమిటీ కార్యదర్శి మత్తి శ్రీనివాసరావు, దివిసీమ లలిత కళాసమితి కార్యదర్శి కె.చంద్రశేఖర్, మాజీ జెడ్పీటీసీ కొల్లూరి వెంకటేశ్వరరావు, రంగస్థ కళాకారుడు పుప్పాల వీరాంజనేయులుతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

అవనిగడ్డ: గాంధీజీ వర్ధంతిని దివిసీమలోని పలు ప్రాంతాల్లో నిర్వహించారు. వైఎస్సార్ సీపీ స్థానిక కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ తుంగల సుమతీదేవి, పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీపీ మాట్లాడుతూ అహింసా సిద్ధాంతాన్ని ప్రపంచానికి మార్గ నిర్దేశం చేసిన గొప్ప వ్యక్తి గాంధీజీ అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపన దిశగా పాలన సాగిస్తున్నారని చెప్పారు. అనంతరం స్థానిక పీఎస్ వద్ద ఉన్న గాంధీజీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలకు ఎంపీపీ, జెడ్పీటీసీ, అధికార ప్రతినిధి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యులు షేక్‌నజీర్‌బాషా, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు అన్నపరెడ్డి రాందాస్, ట్రేడ్ యూనియన్ కన్వీనర్ గార్లపాటి గోపీ, ఉపసర్పంచ్ గాజుల జయగోపాల్, పలువురు ఆర్యవైశ్య సంఘం నేతలు తదితరులు పాల్గొన్నారు.

మణికంఠ జాతీయ స్థాయికి ఎదగాలి

వక్కలగడ్డ (చల్లపల్లి): రాష్ట్ర స్థాయి 66వ స్కూల్ గేమ్స్ అథ్లెటిక్స్ అండర్–17 రన్నింగ్‌లో పతకాలు సాధించిన మురాల రాజశేఖర మణికంఠ జాతీయ స్థాయిలో రాణించాలని సర్పంచ్ వల్లూరు ఉమా ఆకాంక్షించారు. అథ్లెటిక్స్ 400 మీటర్ల రన్నింగ్‌లో రజతం, 300 మీటర్ల రన్నింగ్‌లో కాంస్య పతకం సాధించిన మణికంఠకు అతని స్వగ్రామం వక్కలగడ్డలో సోమవారం ఘనంగా సన్మానం జరిగింది. పీఏసీఎస్ చైర్మన్ హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు మల్లుపెద్ది రత్నకుమారి, చినకళ్లేపల్లి సర్పంచ్ గుత్తికొండ రామారావు, పాల కేంద్రం అధ్యక్షులు మల్లుపెద్ది బోసు తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిపై అవగాహన అవసరం

పెడన: కుష్ఠు వ్యాధిపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని పెడన ప్రాథమిక వైద్యాధికారి మీనాదేవి అన్నారు. కుష్ఠు వ్యాధి నివారణ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని కొంకేపూడి గ్రామ సచివాలయం వద్ద అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. డాక్టర్ మాట్లాడుతూ శరీరంపై మచ్చలు ఏర్పడిన చోట స్పర్శ లేకపోవడం, చర్మంపై రాగి రంగు మచ్చలు, పొడలు రావడం, లావుగా మారి నరాలు నొప్పులు రావడం, కాళ్లు చేతులు కండరాల బలహీనత, అరిచేతులు, పాదాలు తిమ్మిర్లు అధికంగా ఉండటం, నొప్పిగా అనిపించని పుండ్లు చేతులలోను, పాదాలతో ఉండటం వంటి లక్షణాలుంటాయని, వీటిని గుర్తించడం సులభంగా ఉంటాయన్నారు. ఈ వారోత్సవాలు జనవరి 30 నుంచి ఫిబ్రవరి 13 వరకు జరుగుతాయని ఎంపీహెచ్‌వో వీరయ్య తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి దావు భైరవలింగం, సచివాలయ ఉద్యోగులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మంగళాపురం (చల్లపల్లి): కుష్ఠు వ్యాధితో పోరాడదాం – కుష్ఠు వ్యాధిని చరిత్రగా మార్చేద్దాం నినాదంతో ప్రభుత్వం లెప్రసీ అవగాహన పక్షోత్సవాలు చేపట్టినట్లు వైద్యాధికారి డాక్టర్ విజయరావు అన్నారు. సోమవారం స్థానిక గ్రామ సచివాలయంలో పురిటిగడ్డ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో లెప్రసీ అవగాహన పక్షోత్సవాలు ప్రారంభించారు. సర్పంచ్ డొక్కు నాగేశ్వరరావు ప్రభుత్వ సందేశం అందించారు. డాక్టర్ విజయరావు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నాగిరెడ్డి, లెప్రసీ మండల నోడల్ సూపర్‌వైజర్ తోట సుధాకరరావు, హెల్త్ విజిటర్ స్వర్ణకుమారి, ఎంఎల్‌హెచ్‌పీ దినేష్, హెల్త్ అసిస్టెంట్ వి.రాంబాబు పాల్గొన్నారు.



పెడన మండలం కొంకేపూడిలో కుష్ఠువ్యాధిపై అవగాహన కార్యక్రమం

బంటుమిల్లి: పెదతుమ్మిడి, బంటుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల(పీహెచ్‌సీ) ఆధ్వర్యంలో సోమవారం కుష్ఠు నివారణ అవగాహన కార్యక్రమాలు మొదలయ్యాయి.

వైద్యాధికారులు పవన్‌కుమార్, సువర్చల, జయశ్రీల పర్యవేక్షణలో ఆయా పీహెచ్‌సీల పరిధిలోని సబ్ సెంటర్ల వైద్య సిబ్బందికి అవగాహన సమావేశాలు నిర్వహించారు. దీనిలో సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, స్థానికులు పాల్గొన్నారు. అనంతరం సిబ్బందితో కలసి గ్రామాల్లో ర్యాలీలు చేశారు.

రొయ్యల మేత చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

రూ. 5.85 లక్షల విలువైన మేత కట్టలు స్వాధీనం

కృత్తివెన్ను: రొయ్యల చెరువుల వద్ద చోరీకి గురైన లక్షలాది రూపాయల విలువైన రొయ్యల మేతను స్వాధీనం చేసుకుని, నిందితుడిని అరెస్ట్ చేసినట్లు కృత్తివెన్ను ఎస్ఐ గణేష్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 25వ తేదీ రాత్రి మాట్లాం గ్రామానికి చెందిన పాండురంగారావు చెరువు వద్ద నుంచి రూ. 1,51,800 విలువైన 69 మేత కట్టలు, చందాల గ్రామానికి చెందిన పులిరాజు చెరువు వద్ద నుంచి రూ. 1,34,200 విలువైన 61 మేత కట్టలు చోరీకి గురైనట్లు ఈ నెల 27న ఫిర్యాదు రాగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దీనిపై విచారణ చేస్తుండగా 29వ తేదీ సాయంత్రం పల్లెపాలెం సమీపంలో ప్రేమరాజును అదుపులోకి తీసుకున్నామన్నారు. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురానికి చెందిన అతన్ని పట్టుకుని విచారిస్తుండగా వివిధ ప్రాంతాల్లో నిందితుడిపై పలు కేసులున్నట్లు తేలిందన్నారు. దీంతో అతని నుంచి రూ. 5,85,200 విలువైన 266 మేత కట్టలను స్వాధీనం చేసుకుని వాటిని సీజ్ చేసి నిందితుణ్ణి అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు హాజరుపరిచామన్నారు.

సింధు స్నానాలకు ఏర్పాట్లు

● సాగరతీరం, హంసలదీవి ఆలయాలను పరిశీలించిన అధికారులు
● లక్ష మందికి పైగా భక్తులు వస్తారని అంచనా

కోడూరు: మాఘపౌర్ణమిని పురస్కరించుకొని హంసలదీవి సాగరతీరంలో నిర్వహించే సింధుస్నానాలకు ప్రభుత్వం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. సోమవారం సాగరతీరం, హంసలదీవి వేణుగోపాలుడి ఆలయ ప్రాంతాలను వివిధ శాఖల అధికారులు పరిశీలించారు. ఫిబ్రవరి 5న జరిగే సింధుస్నానాలు ఈ ఏడాది ఆదివారం రావడంతో లక్ష మందికి పైగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని తహసీల్దార్ షేక్ లతీఫ్‌పాషా తెలిపారు.

ప్రత్యేక ఇంజిన్ల ద్వారా జల్లు స్నానాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా వాహనాలను రెండు రహదారుల వెంట మళ్లీస్తున్నట్లు అవనిగడ్డ సీఐ జి.శ్రీనివాస్ తెలిపారు. వన్‌వే ట్రాఫిక్ ఆంక్షల్లో భాగంగా సింధుస్నానాలకు వచ్చే వాహనాలను దింటిమెరక మీదగా, తిరుగు ప్రయాణాన్ని హంసలదీవి, ఉల్లిపాలెం గ్రామాల మీదగా పంపనున్నట్లు చెప్పారు. ఫిబ్రవరి 3 నుంచి జరిగే హంసలదీవి వేణుగోపాలుడి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈఓ సుధాకర్ తెలిపారు.




హంసలదీవి ఆలయం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

సింధుస్నానాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా పాలకాయతిప్ప కరకట్ట వద్ద నుంచి బీచ్ వరకు రహదారికి ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ పనులు చేస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగరేవతి తెలిపారు. ఎస్ఐ రాజేంద్రప్రసాద్, వైఎస్సార్ సీపీ జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీరవెంకటనారాయణరావు, సర్పంచి కొక్కిలిగడ్డ భిక్షాలు, ఈఓ యలవర్తి సుబ్రహ్మణ్యం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ నిర్మాణ పనులు ప్రారంభం

పెడన: ప్రతి ఇంటికి తాగునీటి కుళాయి ఏర్పాటు చేసి చరిత్రలో నిలిచేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగులు వేస్తున్నారని పెడన ఎంపీపీ రాజులపాటి వాణి అన్నారు. మండలంలోని నడుపూరులో సోమవారం జలజీవన్ మిషన్ పథకం కింద రూ.1.19 కోట్లతో చేపట్టిన పైపులైను నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంత్రి జోగి రమేష్ చొరవతో నియోజకవర్గ వ్యాప్తంగా జలజీవన్ మిషన్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని చెప్పారు. రూ.1.19కోట్లతో నడుపూరు, మెరికేపాలెం, నడుపూరు అగ్రహారం గ్రామాల్లోని ప్రతి ఇంటికి తాగునీటి కుళాయి ఏర్పాటు చేస్తారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు రాజులపాటి అచ్యుతరావు, సచివాలయాల సమన్వయకర్త బెజవాడ నాగబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు కృష్ణ, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



జలజీవన్ మిషన్ పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ వాణి తదితరులు

పూర్వ విద్యార్థుల సందడి



పెడన: వారంతా 39 ఏళ్ల క్రితం పదో తరగతి చదువుకున్నారు. మండలంలోని చెన్నూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1984–85 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు కలిసి సందడి చేశారు. వివిధ ప్రాంతాల్లో, ఆయా రంగాల్లోను స్థిరపడిన వీరంతా సోమవారం పాఠశాలలో కలుసుకుని మధురస్మృతులను గుర్తు చేసుకుని ఆనందభరితులయ్యారు. నాడు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు సదాశివబ్రహ్మం, విజయలక్ష్మిలను ఘనంగా సత్కరించి ఆశీస్సులు పొందారు. కార్యక్రమంలో కోనభూషయ్య, నల్లమోతు తిలక్, రాజులపాటి కృష్ణ, అనుపమ, ఇందిర తదితరులు పాల్గొన్నారు.